ప్రజాశక్తి

ఆదివారం 20 ఆగస్టు 2023 5 శ్రీకాకుళం

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం

ఈ నెలాఖరు వరకు గడువు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ నెలాఖరులోగా విద్యుత్ సర్వీసు కనెక్షన్ నంబరుకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎల్.దైవప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లు చెల్లింపు సమయంలో గానీ, లైన్‌మెన్, బిల్ కలెక్టర్, సెక్షన్ కార్యాలయం, విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో గానీ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆన్‌లైన్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం, ఇపిడిసిఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా గానీ చెల్లించవచ్చని సూచించారు. ఇపిడిసిఎల్ మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

ఉప పోరులో వైసిపికే ఆధిక్యం

- నాలుగు సర్పంచ్ స్థానాల్లో మూడింటిలో గెలుపు
- వార్డు స్థానాల్లో టిడిపి గట్టి పోటీ
- పదికి నాలుగు చోట్ల ఆ పార్టీ మద్దతుదారుల విజయం
- 78.33 శాతం పోలింగ్ నమోదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

సరుబుజ్జిలి : వెంకట నరసమ్మకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

బూర్జ : పెద్దలంకాంలో ఓటు వేసేందుకు వరుసలో ఉన్న ఓటర్లు

పంచాయతీ ఉప ఎన్నికల పోరులో వైసిపి ఆధిక్యం కనబరిచింది. అధిక స్థానాల్లో ఆ పార్టీ మద్దతుదారులు విజయం సాధించారు. జిల్లాలోని నాలుగు సర్పంచ్, పది వార్డు సభ్యుల స్థానాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పోలింగ్ ముగిసిన తర్వాత రెండు గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు. నాలుగు సర్పంచ్ స్థానాలకు గానూ వైసిపి మద్దతుదారులు మూడు చోట్ల విజయం సాధించగా, ఒకచోట టిడిపి మద్దతుదారు గెలిచారు. వార్డు సభ్యుల స్థానాల దగ్గరకొచ్చేసరికి టిడిపి గట్టి పోటీనిచ్చింది. పది వార్డు సభ్యులకు గానూ ఆరు చోట్ల వైసిపి, నాలుగు స్థానాల్లో టిడిపి మద్దతుదారులు విజయం సాధించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

మండలం	పంచాయతీ	సర్పంచ్	మెజార్టీ	మద్దతుదారు
సరుబుజ్జిలి	బొప్పడాం	పి.వెంకటనరసమ్మ	127	టిడిపి
నందిగాం	అన్నాపురం	ఇంద్రవేణి	89	వైసిపి
బూర్జ	పెద్ద లంకాం	కె.గోవిందరావు	80	వైసిపి
సారవకోట	బద్రి	బి.అసిరమ్మ	29	వైసిపి

పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార వైసిపి అధిక స్థానాల్లో గెలిచినా, ఆ పార్టీకి సంతోషం లేకుండా పోయింది. గతంలో ఆ పార్టీ మద్దతుదారుడు గెలిచిన స్థానం ఇప్పుడు టిడిపి పరమైంది. సరుబుజ్జిలి మండలం బొప్పడాం పంచాయతీలో 2021 ఎన్నికల్లో వైసిపి మద్దతుతో పోటీ చేసిన పి.విజయలక్ష్మి ఆరు ఓట్లతో గెలుపొందారు. ఆమె మరణించడంతో నిర్వహించిన ఎన్నికల్లో టిడిపి మద్దతుదారునిగా పోటీ చేసిన పి.వెంకటనరసమ్మ 127 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మరోవైపు పది వార్డు స్థానాలకు టిడిపి నాలుగు స్థానాలు కైవసం చేసుకుని సత్తా చాటింది. ఆమదాలవలస నియోజకవర్గంలో రెండు వార్డులను స్వల్ప ఓట్లతో ఆ పార్టీ మద్దతుదారులు ఓటమి పాలయ్యారు. ఆమదాలవలస మండలం కొరపాం వార్డును మూడు ఓట్లు, సరుబుజ్జిలి మండలం తెలికిపెంట వార్డును ఐదు ఓట్లతో కోల్పోయింది. పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం గ్రామస్థాయి నాయకులు కొంతవరకు బాగానే పోరాడినా జిల్లా నాయకత్వం ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలం	పంచాయతీ	వార్డు మెంబరు	మద్దతుదారు
టెక్కలి	నర్సింగపల్లి	ఎం.పావని	వైసిపి
సరుబుజ్జిలి	తెలికిపెంట	వి.అప్పలనరసమ్మ	వైసిపి
పోలాకి	కొత్తరేవు	ఎ.ఉమ	వైసిపి
	గాతలవలస	పి.శాంతారావు	టిడిపి
ఆమదాలవలస	కొరపాం	ఎం.లక్ష్మి	వైసిపి
జలుమూరు	జోణంకి	బి.సూరమ్మ	టిడిపి
ఎచ్చెర్ల	డి.మత్స్యలేశం	కె.కృష్ణారావు	టిడిపి
నరసన్నపేట	కోమర్తి	ఎల్.రాజారావు	వైసిపి
	మాకివలస	పి.సింహాచలం	టిడిపి
వజ్రపుకొత్తూరు	యు.జిపురం	కె.కృష్ణారావు	వైసిపి

జిల్లా పార్టీ నుంచి ఏ మాత్రం సహకారం అందినా తమ ఖాతాలో మరిన్ని స్థానాలు పడేవని నాయకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ఐదు సర్పంచ్ స్థానాల్లో ఒకటి ఏకగ్రీవం కాగా అది వైసిపి ఖాతాలో పడింది. నామినేషన్లు వేసి ఎన్నికలు జరిగిన 76 స్థానాల్లో 66 వార్డుల్లో 61 వైసిపి మద్దతుదారులే ఏకగ్రీవంగా గెలిచారు. ఫలితాల దగ్గరకొచ్చేసరికి ఆ స్థాయిలో గెలవలకపోయిందని టిడిపి నాయకులు ఉదహరిస్తున్నారు. ఏదేమైనా పంచాయతీ ఎన్నికల ఉప సమరం టిడిపి శ్రేణుల్లో కొంత జోష్‌ను నింపింది.

78.33 శాతం పోలింగ్

జిల్లాలోని నాలుగు సర్పంచ్, పది వార్డు స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో 78.33 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 5,020 మంది ఓటర్లు ఉండగా 3,932 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2,346 మంది పురుషులకు గానూ 1880 మంది (80.14 శాతం) ఓటు వేశారు. 2,674 మంది మహిళలు ఓటు వేయాల్సి ఉండగా 2,052 మంది (76.74 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి సరుబుజ్జిలి మండలం బొప్పడాంలో అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. ఇక్కడ మొత్తం 717 మంది ఓటర్లు ఉండగా 635 మంది (88.56 శాతం) తమ ఓటును వినియోగించుకున్నారు. సారవకోట మండలం బద్రిలో అత్యల్ప పోలింగ్ శాతం నమోదైంది.

పోరాటాలతోనే ఆప్కాస్‌లోకి కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కమిషనర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న నాయకులు, కార్మికులు

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేసిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం విలీన పంచాయతీల కార్మికులను ఆప్కాస్‌లో చేర్చిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం అన్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును శనివారం కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించక తప్పలేదన్నారు. ఈనెల 10న మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఫెడరేషన్‌తో జరిపిన చర్చల్లో కార్మికులను ఆప్కాస్‌లో చేర్చేందుకు, మృతి చెందిన, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించడంతో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రానున్న కాలంలో సంఘాన్ని మరింత పటిష్టపరచడానికి మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, క్లాప్ డ్రైవర్లను, విలీన గ్రామ పంచాయతీ కార్మికులు, కోవిడ్, వరద ముంపు తదితర పేర్లతో విధులు నిర్వహిస్తున్న కార్మికులందరినీ సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ పోరాటాల వల్ల ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. కార్మికులంతా క్రమశిక్షణగా పనిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, శేఖర్, జనార్ధన్, ఎ.రాము, డి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల తొలగింపునకు డాక్యుమెంట్లు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సరైన ధ్రువపత్రాలు లేకుండా ఓటర్లను తొలగించరాదని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పష్టం చేశారు. నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా తొలగింపులకు సంబంధించి పత్రాలు సక్రమంగా ఉన్నదీ, లేనిదీ శనివారం పరిశీలించారు. ఓట్ల తొలగింపు ప్రక్రియలో తగిన జాగ్రత్తలు పాటించి పూర్తి ఆధారాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రక్రియ జరగాలని, ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు.

పని సర్దుబాటు వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల పని సర్దుబాటును తక్షణమే నిలిపివేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న పని సర్దుబాటు ప్రక్రియను ఎంఇఒలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఉప విద్యాశాఖాధికారులు మాత్రమే సీనియార్టీ జాబితాలు తయారు చేసి పని సర్దుబాటును చేయాల్సిన ఉన్నా, ఎంఇఒలే ఇష్టారాజ్యంగా చేసేస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రవేశాలు పొందిన విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లో పెట్టని కారణంగా గత నెల 31వ తేదీ నాటికి అక్కడ రోల్ తక్కువగా చూపడంతో కొన్ని పోస్టులు అదనంగా ఉన్నట్లు ఎంఇఒలు చెప్తున్నారని తెలిపారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒల మధ్య సమన్వయం లేకపోవడంతో ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా మారిందన్నారు. పని సర్దుబాటును కొనసాగిస్తే సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలు జరిగి మూడు నెలలు కావస్తున్నా కొంతమంది ఉపాధ్యాయులకు నేటివరకు జీతాలు చెల్లించడం లేదని, మళ్లీ ఇప్పుడు పని సర్దుబాటు పేరుతో వేరే పాఠశాలలకు పంపించడం సరికాదన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, ఎపిటిఎఫ్ (257) నాయకులు మజ్జి మదన్మోహన్, డిటిఎఫ్ నాయకులు పేడాడ కృష్ణారావు, పూజారి హరిప్రసన్న, ఎపిటిఎఫ్ (1938) నాయకులు టి.చలపతిరావు, ఎస్‌టియు నాయకులు పి.తమ్మినాయుడు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

కాలనీల్లో మౌలిక వసతులు తప్పనిసరి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - జలుమూరు

జగనన్న కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస జగనన్న కాలనీలను శనివారం పరిశీలించి, లబ్ధిదారులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లతో పాటు మెయిన్ రోడ్డు నుంచి కాలనీకి వచ్చేందుకు రోడ్డు బాగా లేదని, తాగునీటికీ ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కాలనీలో గ్రావెల్ రోడ్లతో పాటు మెయిన్ రోడ్డు నుంచి కాలనీకి వచ్చేందుకు బిటి రోడ్డు వేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జంగిల్ క్లియరెన్స్, పారిశుధ్య పనులు చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. తాగునీటి సమస్యను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని అందించాలని ఆదేశించారు. మళ్లీ తాను వస్తానని, అప్పటికి అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం జోణంకి పంచాయతీలో రెండో వార్డుకు నిర్వహిస్తున్న ఎన్నికను పరిశీలించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ పీడీ ఎన్.గణపతిరావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి అప్పారావు, హౌసింగ్ ఇఇ కె.అప్పారావు, ఇఒపిఆర్‌డి పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి జ్ఞాన సువర్ణరాజు

శాశ్వత లోక్ అదాలత్ ద్వారా సమగ్రమైన, సత్వర న్యాయం అందుతుందని శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి జ్ఞాన సువర్ణరాజు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని లోక్‌అదాలత్ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో ప్రజా ప్రయోజిత సేవల అవగాహనా సదస్సును శనివారం నిర్వహించారు. ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల్లో అవాంతరాలు ఎదురైనా శాశ్వత లోక్‌అదాలత్‌కు నేరుగా తెలియజేయవచ్చన్నారు. విద్య, వైద్యరంగాల సేవల్లో లోపాలు ఉంటే సకాలంలో ఫిర్యాదు చేయాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టం-1987 మేరకు 2006లో శాశ్వత లోక్‌అదాలత్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. సమగ్ర, సత్వర తీర్పులు ఇవ్వడమే వీటి ప్రధాన లక్ష్యమన్నారు. త్వరలో మహిళా సంఘాల ప్రతినిధులతో శాశ్వత లోక్‌అదాలత్ పరిధిలోకి వచ్చే ప్రజా ప్రయోజన సేవలు వివరిస్తామని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పొగిరి పిహెచ్‌సి వైద్యాధికారి జె.కృష్ణమోహన్, పలు శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

పాఠశాలల్లో వియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈ క్లబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వినియోగదారుల క్లబ్‌ల ఏర్పాటుపై ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై విజయవాడలో శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. చట్టం విశిష్టత, అవసరాన్ని విద్యార్థులు, ప్రజలకు తెలియజేయాలని వివరించారు. హక్కుల ఉల్లంఘన ఎలా జరుగుతుందనే విషయాలపై తెలపాలన్నారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బి.రామ్మోహనరావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. జిల్లాలో 106 క్లబ్‌లు ఏర్పాటు చేయగా, పాఠశాలల్లో 100 క్లబ్‌లు, డిగ్రీ కళాశాలల్లో ఆరు క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం వినియోగదారుల హక్కులు, చట్టాలు తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిఎస్ఒ వెంకటరమణ, తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వరరావు, ఎఎస్ఒ జె.రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి గోపాల్, ఈశ్వర సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ (ప్రెస్ అకాడమీ) చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈనెల 22వ తేదీన జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి ఉదయం పది గంటలకు శ్రీకాకుళం ఆర్ అండ్ బి అతిథిగృహానికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించే 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమం అనంతరం విశాఖపట్నంకు బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

ఎన్నికలు ఏవైనా విజయం మాదే

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట : జిల్లాలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో వైసిపి బలపరిచిన అభ్యర్థులు అత్యధిక సంఖ్యలో విజయం కైవసం చేసుకున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గెలుపొందిన వైసిపి బలపరిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలు ఏవైనా వైసిపిదే విజయమని మరోసారి రుజువైందని పేర్కొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

ఆమదాలవలస : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సచివాలయ, జెసిఎస్ కన్వీనర్లకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని సచివాలయ, జెసిఎస్ కన్వీనర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రత్యేక పరిశీలకులు, ఎమ్మెల్సీ రఘురామరాజుతో కలిసి ఆయన మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. సచివాలయ, జెసిఎస్ కన్వీనర్లు వార్డుల వారీగా ప్రజానీకంతో మమేకమై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందిన లబ్ధిని వివరించాలని సూచించారు. ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత కన్వీనర్లదేనని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలు గ్రామస్థాయిలో విజయవంతం కావడంలో కన్వీనర్ల పాత్ర కీలకమైందని కొనియాడారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైసిపిని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్ కుమార్, గురుగుబెల్లి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి నారాయణరావు, నిరంజన్ బాబు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రచారాల వెల్లువ... సమీకరణాల సవాళ్లు

విస్తృత, వికృత ప్రచారాల వెల్లువ జిల్లాలో కనిపిస్తుంది. ఇలాంటి ప్రచారాలకు అంతం ఉండకపోగా, ఊపునిచ్చే పరిస్థితి కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సరికొత్త సమీకరణాలకు సవాళ్లుగా మారుతున్నాయి. ప్రచార వెల్లువలో ఎవరూ ఊహించని ప్రచారం సాగింది. కాంగ్రెస్ వారసత్వం పుణికిపుచ్చుకున్న కుటుంబం నుంచి జిల్లా అధ్యక్షులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతిని వైసిపిలోకి కొందరు నేతలు ఆహ్వానించారన్నది ఆ ప్రచారంలో సారాంశం. ఇటీవల ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కీ.శే బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంతోత్సవాలు జరిగాయి. ఆ సమయంలోనే కొందరు వైసిపి నేతలు ఆమెను పార్టీలోకి వస్తే మంచిదని ఆహ్వానించినట్లు ప్రచారం మొదలైంది. ఆ ప్రతిపాదనను ఆమె సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. ఆమదాలవలస కేంద్రంగానే మరో ప్రచారం ముందుకొచ్చింది. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను వైసిపిలోకి ఆహ్వానిస్తున్నారన్నది ఆ ప్రచారం. టిడిపిలోని మరో ప్రధాన సామాజిక తరగతి నుంచి ఆ ప్రచారం మొదలైందని, దాని వెనుక ముఖ్య నేతల హస్తం ఉందన్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లోనే ఉంది. ఆమదాలవలస కేంద్రంగా జరిగిన ప్రయత్నాలు, ప్రచారాలు బెడిసికొట్టినట్లు స్పష్టమైంది. వైసిపి ఎంపీ టిక్కెట్ విషయంలోనే ఇలాంటి ప్రయత్నాలు మొదలైనట్లు కనిపిస్తుంది. మొదట్లో వైసిపి ఎంపీ అభ్యర్థులుగా తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ పేర్లు ముందుకొచ్చాయి. తనయులకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే తాము ఎంపీగా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని అధినేత ముందు చెప్పినట్లు తెలిసింది. అందుకు ఎర్ర లైట్ వెలగడంతో మౌనం దాల్చడం వారి వంతైంది. తాజాగా ధర్మాన ప్రసాదరావు తాను ఎంపీగా వెళ్లడం లేదని స్పష్టం చేయగా, పార్టీ ఆదేశిస్తే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని కృష్ణదాస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇద్దరు డాక్టర్లు కిల్లి కృపారాణి, దానేటి శ్రీధర్ పేర్లు మాత్రమే ఎంపీ బరిలో వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరు అభ్యర్థి అవుతారో, కొత్త వారు తెరపైకి వస్తారో ఇప్పటికే చెప్పలేని స్థితిలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలిసింది.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసిపికి తలనొప్పులు మొదలయ్యాయి. నియోజకవర్గంలో ప్రధాన సామాజిక తరగతులైన కళింగ, యాదవులకు పార్టీ గుర్తింపునిచ్చింది. మరో ప్రధాన సామాజిక తరగతి అయిన రెడ్డికకు ఈసారి టిక్కెట్ ఇవ్వాలని ఆ సామాజిక తరగతి కారాలు మిరియాలు నూరుతున్నట్లు తెలిసింది. వారికి వెనుక నుంచి యాదవ సామాజిక తరగతి ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఈసారి సాయిరాజ్ కాకుండా ఆయన భార్య జెడ్‌పి చైర్‌పర్సన్ విజయకు టిక్కెట్ ఇవ్వాలన్న ప్రయత్నంలో కళింగ సామాజిక తరగతి తరుపున సాయిరాజ్ ఉన్నట్లు తెలిసింది. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు పార్టీ నేతల నుంచే నిరసన సెగలను ఎదుర్కొంటున్నారు. నాయకత్వం ఇప్పటివరకు ఆ ఎడబాటును దగ్గర చేయలేదు. మంత్రి మళ్లీ అభ్యర్థి అయితే ఓడిస్తామన్న స్థాయికి అసమ్మతి గ్రూపు ప్రకటనలు చేయడం చూశాం. టిడిపి విషయంలో ఈసారి గౌతు శిరీషకు టిక్కెట్ ఇవ్వాలా?, ఆమె తండ్రి గౌతు శ్యామసుందర శివాజీకి ఇవ్వాలా అన్న మీమాంసలో అధినాయకత్వం ఉందని విశ్వసనీయంగా తెలిసింది. జనసేనతో పొత్తు ఉంటే పలాస నియోజకవర్గాన్ని ఆ పార్టీకి వదిలేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

పాతపట్నం నియోజకవర్గంలో చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలనలో గ్రూపుల గాయాలు చూశాం. మున్ముందు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూడాల్సి ఉంది. వైసిపిలోనూ అసమ్మతిరాగం, గ్రూపుల గానం వినిపిస్తోంది. స్థానికులకు టిక్కెట్ ఇవ్వాలన్న నినాదం బలంగా వినిపిస్తోంది. టెక్కలి నియోజకవర్గంలో వైసిపి విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇద్దరు పరస్పరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవిని పంచుకున్నా, కొత్తవారు తెర పైకి వచ్చే అవకాశం లేకపోలేదన్న ప్రచారం పార్టీలోనే ఉంది. నరసన్నపేట నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి ఎవరన్న ప్రచారం ఉంది. బగ్గు రమణమూర్తికి నాయకత్వం నుంచి భరోసా లభించినా, డాక్టర్ బగ్గు శ్రీనివాసరావుతో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడి రాజకీయాల్లోకి వస్తే వైద్య వృత్తి మాటేమిటని అడిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. 40 శాతం టిక్కెట్లు యువతకు ఇస్తామన్నది అమలైతే, అందులో తానుంటానన్న అభిప్రాయంలో శ్రీనివాసరావు ఉన్నారని తెలిసింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపిలో గ్రూపుల గోల సద్దుమణిగింది. ఎన్నికల సమయంలో ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది. టిక్కెట్ మాత్రం గుండ కుటుంబం నుంచి బయటకు పోదని స్పష్టంగా తెలుస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గంలో టిడిపికి ఎలాంటి సమస్య లేదు. వైసిపి విషయంలోనే ఎంపీ అభ్యర్థిగా సీతారాంను బరిలో దించాలన్న ప్రతిపాదన ముందుకొస్తోంది. నాయకుల వారసులకు టిక్కెట్లు ఉండవని అధినేత జగన్ ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిసింది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైసిపి, టిడిపి మధ్య ఉన్న వైరానికి మించి గ్రూపుల గోల సాగుతోంది. మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావును విజయనగరం ఎంపీ అభ్యర్థిగా బరిలో దించాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే టిక్కెట్ తన కొడుక్కి ఇవ్వాలని కళా వెంకట్రావు కోరగా, పార్టీ అందుకు సుముఖత చూపడం లేదని తెలిసింది. అందువల్ల ఎచ్చెర్ల అభ్యర్థి కళా వెంకట్రావు ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైసిపి విషయంలోనూ గ్రూపు గోల బలంగా ఉంది. మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు చిన్న శ్రీను వస్తారన్న ప్రచారం మళ్లీ మొదలైంది. ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌రెడ్డిపై అసమ్మతి రాగం బలపడితే అభ్యర్థి మారే అవకాశాలు ఉన్నాయి. వచ్చే నెల నుంచి వెనుకా ముందు రెండు పార్టీలు టిక్కెట్లు ప్రకటించనున్నట్లు అమరావతి వర్గాల భోగట్టా. మారుతున్న సమీకరణాలు, వెతుకులాట వెల్లువల మధ్య జిల్లా రాజకీయాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గోడ దూకడాలు కనిపిస్తాయి. కొత్త వ్యక్తులు, కొత్త శక్తులు ముందుకొచ్చే పరిస్థితి రావచ్చు.

- సత్తారు భాస్కరరావు

అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జాతీయస్థాయిలో సత్తా చాటాలి
కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆకాంక్షించారు. ఈ నెల 13న విశాఖపట్నంలో జరిగిన జోనల్ స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన స్విమ్మింగ్ క్రీడాకారులను కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదలతో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఏ రంగంలోనైనా తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. జిల్లాలో ఎందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని, వారి స్ఫూర్తితో రాణించి జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలల చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికైన దీక్ష బెహరా, పి.అవినాష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.

విజేతలు వీరే

జోనల్ స్థాయిలో వై.భోనీ అశ్వద్ (3 గోల్డ్), బి.అన్షుల్ రాజ్ (సిల్వర్, బ్రోంజ్), కె.ధైర్య (సిల్వర్), పి.జవహర్‌రాజ్ (సిల్వర్, బ్రోంజ్), బి.జితేంద్ర (సిల్వర్, బ్రోంజ్), కె.సింధు (2 బ్రోంజ్) పతకాలు సాధించారు.

రాష్ట్రస్థాయిలో...

దీక్ష బెహరా (గోల్డ్, 4 సిల్వర్), వై.బోని అశ్వద్ (బ్రోంజ్), పి.అవినాష్ (3 సిల్వర్, బ్రాంచ్) పతకాలతో సత్తా చాటారు. జిల్లాలో స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హారికాప్రసాద్ ఆధ్వర్యాన స్విమ్మింగ్ సీనియర్ కోచ్ కాంతారావు పర్యవేక్షణలో క్రీడాకారులు ప్రత్యేక శిక్షణ తీసుకోవడం వల్లే పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

అవగాహన కల్పిస్తున్న ఈశ్వరరావు

పులి జాడ వదంతులపై గాలింపు

ప్రజాశక్తి- కొత్తూరు

ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం చిన్నదిమిలిలో పెద్ద పులి అడుగు జడలు ఉన్నాయని గ్రామస్తులు అటవిశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ అధికారులు పరిశీలించి పులి అడుగుల అచ్చులను ల్యాబ్‌కు పంపించారు. అయితే భామిని నుంచి కొత్తూరు మండలానికి పులి వచ్చిందని సోషల్ మీడియలో హల్‌చల్ సృష్టించింది. ఈ కథనంపై అటవీశాఖ సెక్షన్ అధికారి ఎల్.ఈశ్వరరావు ఆధ్వర్యాన గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని దొండమనుగూడా, ఈతమనుగూడా, లబ్బ, ఇరపాడుగూడ గ్రామాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా పులి జాడ, పాదల అచ్చులు కనిపించలేదని అన్నారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. రాత్రి పూట బయటకు రావొద్దని, ఆరుబయటకు బహిర్భూమికి వెళ్లదని సూచించారు. రంగు రంగుల దస్తులు ధరించవద్దన్నారు.

అభివృద్ధిపథంలో వజ్రపుకొత్తూరు
ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అభివృద్ధి పథంలో వజ్రపుకొత్తూరు మండలం ముందుకు సాగుతుందని ఎంపిపి ఉప్పరపల్లి నేలవేణి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఆమె అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామని అన్నారు. మంచినీళ్లపేట జెట్టిని హార్బర్‌గా మార్చే ప్రక్రియ వేగవంతమవుతుందని తెలిపారు. ఇంటింటికీ కుళాయితో శుద్ధ జలాన్ని అందించే కార్యక్రమం త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. మండలంలో అక్కుపెల్లి రహదారి పూండి రహదారులకు అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని అన్నారు. రూ.1.78 కోట్లతో వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని నిర్మించారని చెప్పారు. మండల అభివృద్ధికి

మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

కృషి చేస్తున్న పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు పలు శాఖల అధికారుల పనితీరు పైన సభ్యులు ధ్వజమెత్తారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని నిలదీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఎవరు పట్టించుకోవడంలేదని, పూర్తిస్థాయి విద్యుత్‌శాఖ ఎఇఇ లేకపోవడంతో సమస్యలు పరిష్కారంలో జాప్యం జరుగుతుందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉందని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారని మండల ఉద్యానవన శాఖ అధికారిని సునీత తెలిపారు. ఔత్సాహికులైన రైతులు దీనిపై దృష్టి సారించారని కోరారు. గృహ నిర్మాణశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకెవైసి చేసుకున్న రైతులకు ప్రభుత్వపరంగా అందే పథకాలు వర్తిస్తాయని వ్యవసాయశాఖ అధికారి కిరణ్మాని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, డిటి గిరిరాజు, వైస్ ఎంపిపి వం రాజు, టి.శ్రావణి, మండల విప్ తిర్రి గుణ, ఎంపిటిసి బాలక శ్రీను, వరదరాజులు పాల్గొన్నారు.

సంతకం చేస్తున్న సర్పంచ్ అఖిల్

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

80 కేజీల జీడి పిక్కలు బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుత్వానికి కె.బాలాజీరావు, టి.భాస్కరరావు డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథపురంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గాడి అఖిల్ శనివారం మొదటి సంతకం పెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జీడి రైతుల కష్టాలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మద్దతు ధర విషయంలో ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచేలా కార్యాచరణ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుబ్బ భాస్కరరావు, డి.భానుమతి పాల్గొన్నారు.

'బొల్లినేని'లో ఎయిమ్స్ నార్సెట్‌పై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఎయిమ్స్ నార్సెట్ శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఈ శిక్షణకు బిఎస్‌సి నర్సింగ్, జిఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అత్యుత్తమ శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. అలాగే ఇంటర్ పాసైన విద్యార్థులకు 9 బిఎస్‌సి పారామెడికల్, బిఎస్‌సి నర్సింగ్, బిపిటి, జిఎన్ఎం 14 డిప్లమో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8247656581, 7995013422, 7680945357 సెల్ నంబర్లకు గాని, నేరుగా సంస్థ కార్యాలయాన్ని గాని సంప్రదించాలని సూచించారు.

అందరి దృష్టి పాప వైపే...

- ఉదారంగా స్పందిస్తున్న దాతలు
- ఐదు రోజుల్లో రూ.8.5 లక్షలు అందజేత

ప్రజాశక్తి- కవిటి

ఏ నోట విన్నా పాప ఎలా ఉందన్న మాటలే... ఏ ఫోన్ చూసినా ఆ పాప ఆరోగ్యం గురించిన సందేశాలే. ఎల్లలు దాటిన వారూ పాప చల్లగా ఉండాలని ఆర్థికసాయం అందిస్తూ... తమ ఉదారత చాటుకుంటున్నారు. దీని ఫలితంగా కేవలం ఐదు రోజుల్లోనే దాతలు రూ.8.5 లక్షలు అందజేశారు. పాప ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రగడపుట్టుగకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బల్లెడ విద్యాసాగర్ రూ. 25 వేలు, అమెరికాలో ఉంటున్న వంశీ రూ.8 వేలు, రామయ్యపుట్టుగ గ్రామస్తులు రూ.20 వేలు, ఎస్‌విజె ఛారిటీ హౌస్ రూ.15,816, వలస వెళ్లిన ధర్మపురం యువకులు రూ.25 వేలు, సన్యాసిపుట్టుగకు చెందిన

నగదును అందిస్తున్న వంశీ, మణికుమార్

నగదును అందిస్తున్న విద్యాసాగర్

హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ రూ.17,500, నేవీలో పనిచేస్తున్న పసుమతి నరేష్ తన స్నేహితులతో సేకరించిన రూ.40 వేలు, స్థానిక కళ్యాణి ఆంగ్ల పాఠశాల చిన్నారులు రూ.6,500, పలాసపురానికి చెందిన బెందాలం వెంకటరమణ రూ.5 వేలు, సీపాన చంద్రశేఖర్ రూ.5 వేలు, విశాఖపట్నం టీమ్ రూ.5,600, ఈదుపురం యూత్ 10,200, దూగానపుట్టుగకు చెందిన స్నేహిత ఫౌండేషన్ రూ.20 వేలు, కవిటి లగేజీ ఆటో యూనియన్ రూ.5 వేలు, సిరిమామిడికి చెందిన లోకనాథం రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి చిరంజీవి మాట్లాడుతూ ఇప్పటి వరకూ దాతల నుంచి రూ.9.30 లక్షలు అందజేశారని, సాయం చేస్తున్న ప్రతి హృదయానికీ వందనమని కృతజ్ఞతలు తెలిపాడు.

లీలారావుకు అభినందనలు

ప్రజాశక్తి- రణస్థలం

హిరమండలం మండలంలోని గార్లపాడు నిర్వాసిత గ్రామానికి చెందిన ఎ.వి.లీలారావు విశాఖపట్నం ఎయిర్ పోర్టులో సిఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన పోలీసు శాఖలో చేసిన సేవలకు స్వతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, కలెక్టర్ మల్లిఖార్జున, పోలీసులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సిఐ లీలారావు తండ్రి అగతముడి సింహాచలం స్థానిక జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సిగా రెండు పర్యాయాలు పదేళ్ల పాటు పనిచేశారు. లీలారావు హైస్కూల్ విద్య రణస్థలంలోనే సాగింది. ఈ సందర్భంగా రణస్థలం స్నేహితులు బలివాడ శ్రీనివాస్, జి.కె.కె.రాజా, శనాపతి వరప్రసాదరావు, దూసి వెంకటేష్, లింగం జగన్, రామ్మోహన్ పాత్రో, మెట్ట చంద్రరావు, ఉదయ్‌కుమార్ స్నేహితులు అభినందించారు. ఇటువంటి అవార్డులు, రివార్డులు మరిన్ని అందుకుని మంచిపేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు.

రమణ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి పాత పెట్రోల్ బంకు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వల్లభరావుపేటకు చెందిన దువ్వాన రమణ (35) మృతి చెందగా, రణస్థలానికిచెందిన కె.శ్రీనివాసరావు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు రమణ, శ్రీనివాసరావు బైక్‌పై రోడ్డు దాటుతున్నాడు. విశాఖపట్నం ఉనంచి శ్రీకాకుళం వైపు వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందగా, శ్రీనివాసరావు గాయపడ్డాడు. మృతుడు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. క్షతగాత్రుడు కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జి.రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని శవపంచ నామా నిర్వహించిన పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు రోజుల వ్యవధిలో తల్లీకొడుకు మృతి

ఆమదాలవలస : మండలంలోని లొద్దలపేటకు చెందిన ఇలపండ రామారావు (43) ఈ నెల 14న జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. కుమారుడు మృతితో తల్లి పార్వతి అనారోగ్యానికి గురై ఐదు రోజుల వ్యవధిలోనే శనివారం మధ్యాహ్నం మృతి చెందింది. ఒకే కుటుంబంలో ఐదు రోజుల వ్యవధిలోనే తల్లీకుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి ఇంటర్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.


చోరీకి గురైన సిసి కెమెరా హార్డ్ డిస్క్, సామగ్రి

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

కొత్తూరు : స్థానిక బత్తిలి రోడ్‌లోని ఉన్న అరవింద్ ఎలక్ట్రికల్ రివైడింగ్ షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని షాపు యజమాని చోడవరపు ముకుంద రావు తెలిపారు. రాత్రి 10.30 గంటలకు షాపు మూసి వేసి ఇంటికి వెళ్లానని అన్నారు. శనివారం ఉదయం యథావిధిగా షాపు తెరిచేందుకు రాగా తాళంకు ఉన్న రింగ్ కోసి కోసి ఉందని అన్నారు. వెంటనే లోపలకు వెళ్లి చూడగా పరికరాలు దొంగిలించుకుపోయారని తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశానని అన్నారు. కాఫర్ వైరు వంద కేసులు, సిసి కెమెరా హార్డ్ డిస్క్ చోరీకి గురయ్యాయని, వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

సచివాలయం తనిఖీ

పలాస : మండలంలోని గురుదాసుపురం సచివాలయాన్ని ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని సిబ్బదికి ఆదేశించారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎవరెవరికి పథకాలు ఇచ్చామన్నా విషయాన్ని నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. అనంతరం సచివాలయం ఉద్యోగులతో, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు.

డిగ్రీ కళాశాలకు 'ఐఎస్ఒ' గుర్తింపు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఒ) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, శక్తి వినియోగం, ఫలితాలు, విద్యా సంవత్సరానికి సంబంధించిన అంశాలపై కమిటీ పర్యవేక్షించిందని అన్నారు. ఐఎస్ఒ గుర్తింపు రావడం గర్వకారణమని అన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాలు వల్ల విద్యాప్రమాణాలు పెరిగే ఆవకాశం ఉందన్నారు. విద్యార్థులు తమ చదువులకు బంగారుబాట వేసుకోవచ్చునని తెలిపారు. కళాశాలకు ఐఎస్ఒ గుర్తింపు రావడంపై వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఆధ్యాపకులు రామారావు, సిబ్బంది అభినందించారు.

మాట్లాడుతున్న డాక్టర్ అవని

రక్తహీనత గర్భిణులను గుర్తించాలి

సంతబొమ్మాళి: రక్తహీనత గర్భిణులను గర్భిణులను గుర్తించాలని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అవని అన్నారు. పిహెచ్‌సిలో ఎఎన్ఎంలతో, హెల్త్ అసిస్టెంట్లతో, ఎంఎల్‌హెచ్‌పిలతో, కార్యకర్తలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సిడి, ఎన్‌సిడిసిడి సర్వే వేగవంతం చేయాలన్నారు. ఈ సర్వేలో బిపి, సుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సిహెచ్ఒ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సతీసమేతంగా శనివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి అర్చకులు శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జడ్జి మణి

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి మాట్లాడుతూ న్యాయవాదుల కుటుంబ సభ్యుల కోసం ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవిత ప్రయాణంలో ఆరోగ్యంపై మెలుకువగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు వైద్యులు టి.రమ్యశ్రీ, పి.సుధీష్ణాదేవి 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 20 మందిని జెమ్స్‌కు రిఫర్ చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, క్యాంపు కో-ఆర్డినేటర్ కె.దిలీప్, ఎగ్జిక్యూటివ్‌లు జి.త్రినాథరావు, కె.కుమారస్వామి, న్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, గురుగుబెల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు.

టెక్కలి : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర, జనరల్ వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఎస్ఐ ఎల్.రామకృష్ణ ప్రారంభించారు. శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి వైద్యాధికారి బుడుమూరు రమణ, వైద్య సిబ్బంది 145 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే విజయనగరానికి చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు భీమశంకర్‌కు నేత్రాలను పరీక్షించి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు పర్యవేక్షణలో టెక్కలి, సంతబొమ్మాళి రోగులు పాల్గొన్నారు. విశ్రాంత డిటి ఉర్జాన మేరీ నారాయణరావు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కె.ధనుంజయరావు, గౌరవ అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, కోరాడ మోహనరావు, రెయ్యి పున్నయ్య, దూసి ఆంధ్రా స్టాలిన్, ఆనిశెట్టి చిట్టెన్న, నంబూరు భాస్కరరావు, దల్లి వీరాస్వామిరెడ్డి, బొడ్డ అయ్యబాబు పాల్గొన్నారు.

టిడిపితోనే మహిళలకు పెద్దపీట

లావేరు: తెలుగుదేశం పార్టీ హయాంలోనే మహిళలను గుర్తించి అన్నీ రంగాల్లో పెద్దపీట వేసిందని తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత అన్నారు. మండలంలోని పెద్దరావుపల్లి పంచాయతీ ఆరంగిపేటలో టిడిపి మేనిఫెస్టులో భాగంగా శనివారం మహాశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టో పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో మహిళలను గుర్తించి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

డ్రోన్‌ను పరిశీలిస్తున్న ప్రసాద్

ముమ్మరంగా రీ సర్వే

జి.సిగడాం: భూముల రీ సర్వే ముమ్మరంగా జరుగుతున్నాయని తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని పెంటలో చేపడుతున్న భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలకమైన డ్రోన్ సర్వే, ఆ తర్వాత దశల్లో జరిగే క్షేత్రస్థాయి నిజ నిర్ధారణ, గ్రౌండ్ వాలిడేషన్ వంటి పనులన్నీ చకచకా ముందుకు సాగుతున్నాయని అన్నారు. డ్రోన్ సర్వేను మండలంలోని 43 రెవెన్యూ గ్రామాలకు 20 గ్రామాలకు రీ సర్వే పూర్తి చేశామని అన్నారు. ఇప్పటికే పది గ్రామాలకు డ్రోన్ ఫ్లయింగ్ జరిగిందని, మిగతా 13 గ్రామాల్లో రీ సర్వే వేగవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డ్రోన్ ఫ్లయింగ్ సర్వే అధికారులు కె.ప్రసాద్ ఐ.నవీన్ ఎం.ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, మక్క నారాయణరావు, భానుప్రసాద్, కార్యదర్శి పి.సురేష్, విఆర్ఒ వేణుగోపాలరావు, విఆర్ఎ బాలకృష్ణ, మక్క శ్రీను, అశోక్ కుమార్, అప్పలరాజు, పావని, కంది నగేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బాధిత మహిళకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఇచ్ఛాపురం మండలం ఈదుపురం దళితుల ఆస్తుల ధ్వంసం కేసులో తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నీరుగార్చిన అప్పటి తహశీల్దార్ ఎస్.గురుప్రసాద్, ఇతర సిబ్బందిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సహచ రక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, బాధిత మహిళ ఎస్తేరు కోరారు. కలెక్టరేట్‌లోని జెసి ఎం.నవీన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొఠారీ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బండారి జేమ్స్, ఎ.పాపయ్యలకు ఈదుపురం రెవెన్యూ గ్రామంలో 1986లో ఎస్‌టి కో కింద డీ పట్టాను ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. ఈ భూమిలో జీడి, మామిడి, పనస, కొబ్బరి చెట్లను పెంచుతూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. జేమ్స్ మృతి తర్వాత వారసురాలిగా ఉన్న ఎస్తేరుకు సంపూర్ణ వారసత్వపు హక్కులు ఉందని అన్నారు. కానీ స్థానికులు ఆ భూమిని ఆక్రమించుకున్నారని, అదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసి కొట్టి, ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేస్తే అప్పటి ఇచ్ఛాపురం తహశీల్దార్ గురుప్రసాద్ తప్పుడు పత్రాలు ఇచ్చి కేసును నీరుగార్చేందుకు సహకరించారని ఆరోపించారు. విచారణ చేపట్టి ఆయనపై తగిన చర్య తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో వచ్చే నెల 4 నుంచి కలెక్టరేట్ వద్ద ధర్నా, 11 నుంచి నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

సృష్టికి ప్రతిరూపం ఫొటోగ్రఫీ

ప్రజాశక్తి- పలాస

సృష్టికి ప్రతి రూపం, పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచేది ఫొటోగ్రఫీ అని, దీనికి సాటి ఏదీ రాదని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, పలాస ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన అన్నారు. కాశీబుగ్గ ప్రయివేట్ కళ్యాణ మండపంలో శనివారం సృష్టి ఐక్యత ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో ర్యాలీ నిర్వహించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుపు, నలుపు కాలంలో ఫొటోగ్రఫీ విరాజిల్లేదని, ఫొటో గ్రాఫర్లు ప్రత్యేకమైన నైపుణ్యం కలిగి ఉండేవారని గుర్తు చేశారు. సాంకేతిక విప్లవం రావడంతో ఫొటోగ్రఫీలో కూడా వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. విషాదం.. సంతోషం.. సంఘటన.. ఏదైనా చిత్రంలో బంధించి వెలుగులోకి తెచ్చేది ఫొటోగ్రాఫరేనని అన్నారు. దీనికి నైపుణ్యం, సృజన తోడయితే అవిష్కృతమయ్యే చిత్రాలకు లభించే ఆదరణ వేరని అన్నారు. అనంతరం సిఐకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.లక్యా, గౌరవ అధ్యక్షులు జయరాం, ఉపాధ్యక్షులు సంతోష్, కార్యదర్శి టి.నాగరాజు, కోశాధికారి బి.బాలకృష్ణ, నందు, నాగేంద్ర, చందులు పాల్గొన్నారు.

పలాస : సిఐను సన్మానిస్తున్న ఫొటోగ్రాఫర్లు

శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాగరాజు

శ్రీకాకుళం అర్బన్ : లూయిస్ డాగ్ రే 184వ జయంతి సందర్భంగా వరల్డ్ ఫొటోగ్రఫీ డే నగర ఫొటోగ్రాఫర్లు ఘనంగా నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు పక్కి వేణు, చిరు డిజిటల్ అధినేత విస్సు, వీర, రవి, శ్రీను, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ సేవా అవార్డులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ పెద్దబ్రాహ్మణవీధికి చెందిన నాగరాజు పండా వరిసాగులో ఉత్తమ రైతు అవార్డును పొందారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కెఎల్ యూనివర్సిటీలో ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవం-23 ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో నాగరాజు పండాకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువ కప్పి ఘనంగా సన్మానించి ప్రశంసపత్రాన్ని ఎరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకులు గార రాఘవరావు, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్, జి.వి.సుబ్బారెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రిన్సిపాల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరిసాగు చేసి అధిక దిగుబడులు పొందానని అన్నారు. ఉత్తమ రైతుగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని అన్నారు. నాగరాజు పండాకు అవార్డు రావడంపై పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ భవానీ, సోదరుడు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, పోతనపల్లి హరి, బొర కృష్ణారావు, కౌన్సిలర్ సవర సోమేష్, పులి రాజులు హర్షం వ్యక్తం చేశారు.

పలాస : నాగరాజు పండాను సన్మానిస్తున్న అధికారులు

ఉత్తమ శాస్త్రవేత్తగా బాలకృష్ణ

ఆమదాలవలస : పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్య శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ సిహెచ్.బాలకృష్ణకు ఆక్వా కల్చర్ విభాగంలో గుంటూరు ఏరువాక ఫౌండేషన్‌లో ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపికై అవార్డును అందుకున్నారు.

శంకరరావుకు...

బూర్జ : మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకరరావుకు ఎపి ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, మార్కెటింగ్ చేయించడం, వస్తువు విలువ ఆధారిత అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఈ అవార్డు అందజేశారు. శంకరరావుకు పెద్దపేట ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, శ్రీకాకుళం నబార్డ్ డిడిఎం కుప్పిలి వరప్రసాద్, నాబార్డు డిడిఎం తుపాకుల నాగార్జున అభినందించారు.

బూర్జ : అవార్డును అందుకుంటున్న శంకరరావు

ఆమదాలవలస : అవార్డును అందుకుంటున్న బాలకృష్ణ

పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

సిఎం జగన్‌కు కృతజ్ఞతలు

ఆమదాలవలస : ఎపి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ఫ్) ఉద్యోగుల జీతాలు పెంచుతూ ప్రభుత్వం జిఒ నంబరు 64 విడుదల సెర్ఫ్ ఉద్యోగుల సంఘం జెఎసి నాయకులు సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి ప్రతినిధులు చింతాడ రామ్మోహన్, బెవర నారాయణరావు, పుల్లట రవికుమార్ మాట్లాడుతూ 2000 నుంచి ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులుగా అప్పటిలో అందరూ పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి నోటిఫికేషన్, పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపికయ్యామని అన్నారు. అప్పటి నుంచి బడుగు, బలహీన వర్గాలను చైతన్యవంతులు చేస్తూ వారి సామాజిక ఆర్థికాభివృద్ధికి, జీవనోపాధులను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రక్తదాతకు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అత్యవసర సమయాల్లో రోగులకు సకాలంలో వైద్యం కోసం అవసరమైన రక్తాన్ని పదేళ్లుగా స్టార్ వాకర్స్ క్లబ్ కోశాధికారి బత్తుల దేవీప్రసాద్ అందిస్తున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దేవీప్రసాద్‌ను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 ఏళ్ల వయసులో ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేస్తూ.. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా, ప్రాణదాతగా నిలుస్తున్నారని అన్నారు. గ్రామాల్లో అవగాహన కల్పించి రక్త నిల్వల సేకరణకు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పి.జి.గుప్త, శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, పొట్నూరు నాగేశ్వరరావు, ఎం.మల్లిబాబు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి ఉమామల్లేశ్వరరావు

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ అవరణలో మెయిన్ రోడ్డుకు అనుకొని రూ.50 లక్షల మండల పరిషత్ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌లు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోని టీవల మరమ్మతులు చేసిన రూమ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, అన్నెపు రామారావు, పేడాడ వెంకటరావు, బల్లి కామరాజు, సింగుపురం వినోద్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల పంపిణీ

కవిటి : రైతు శ్రేయస్సే లక్ష్యంగా సిఎం జగన్ పనిచేస్తున్నట్లు జగతి సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ తెలిపారు. మండలంలోని జగతి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు రాయితీపై ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు విత్తనాలు అందించామని, అవసరమైన ఎరువులు కూడా రాయితీపై ఆర్‌బికెల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోసు, గ్రామ పెద్దలు, విఇఎ కళ్యాణ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- కంచిలి

స్థానిక కంచిలి మార్కెట్ యార్డు వద్ద ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా ఎంపిపి పైల దేవదాస్ రెడ్డి, తహశీల్దార్ హైమావతి, ఎస్ఐ బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంతో ఎంతో మందికి ప్రాణదానం చేసే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. రక్తదానం చేసిన సభ్యులకు ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ శిబిరం ద్వారా 45 యూనిట్ల రక్త సేకరించి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్ శ్రీరామ్ డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు రఘునాథ్ సాహు వర్ధంతి సందర్భంగా ఆవరణలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం మహాదానమని, రక్తదానం వల్ల ఎటువంటి నష్టం లేదని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంత బానపల్లి, కళాశాల అధ్యక్షులు దుర్గప్రసాద్ పండా, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురాం సాహు, తహశీల్దార్ అశోక్ కుమార్ ప్రదాన్, రక్తదాన శిబిరం ఇన్‌ఛార్జి రవిబాబు, కళాశాల వైఆర్‌సి కౌన్సిలర్ పడాల వెంకటరావు పాల్గొన్నారు.

కంచిలి : రక్తదానం చేస్తున్న యువకుడు

వ్యాధులపై అప్రమత్తం

ఇచ్ఛాపురం : సీజనల్ వ్యాధులపై వైద్య బృందం అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మలు సూచించారు. మండలంలోని కొలిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి పంచాయతీలోనూ ప్రజల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో వస్తున్న వ్యాధులు గురుంచి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ సంతోష్‌ముండల్, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, ఆశి పురుషోత్తం, దక్కత నూకయ్య, లోపింటి ధీనబందు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కళ్యాణి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ పి.చంద్రకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో శనివారం సమీక్షించారు. గ్రామాల్లోని మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. బావుల్లో క్లోరినేషన్ చేయించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతి పట్నాయక్, ఎంఇఒ ఎస్.దేవేందరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని గోకర్ణపురం గ్రామస్తులు ఏర్పాటు చేసిన బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని టిడిపి నాయకులు, పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావు శనివారం ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులకు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామస్తులకు ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదిస్తే తప్పక తన వంతు సహాయం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి రవికుమార్, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, సనపల తిరుపతిరావు, పైల కూర్మారావు, యాళ్ల నాగేశ్వరరావు, వెలమల గోవిందరావు, ఎద్దు దాసునాయుడు, అరుబోలు దశరథ, అంపిలి పోలినాయుడు, పిండి వెంకట రామారావు, ముగడ భద్రయ్య, బోను వెంకటరమణ, భరండి గోపాలరావు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే చర్యలు

బూర్జ : బాలికలను వేధిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్‌బాబు హెచ్చరించారు. మండలంలోని ఓ.వి.పేట ఆదర్శ పాఠశాలలో శనివారం 'స్ఫూర్తి' కార్యక్రమం నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ర్యాగింగ్ పేరుతో బాలికలను వేధిస్తే వారిపై కఠిన చర్యలు తీకుంటామని హెచ్చరించారు. అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది హరిప్రసాద్, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ చింతాడ కృష్ణారావు, బి.శివప్రసాదరావు, పి.రమణమూర్తి, డి.సంధ్య పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు

మహిళా సంఘాలతో సమీక్ష

ఇచ్ఛాపురం: ప్రతి పంచాయతీలోనూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుకు కృషి చేయాలని వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు అన్నారు. మహిళా సమాఖ్యలో గ్రామ సంఘాల సహాయకులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడో విడత బ్యాంకు ద్వారా ఇది వరకే రుణాలు పొందిన లక్షణాలు గాని, కొత్తగా రుణాలు తీసుకోవడానికి సుముఖత ఉన్న లబ్ధిదారులకు చిన్న వ్యాపారాలకు రుణం అందించాలి అన్నారు. గ్రామ సంఘాల ఆర్థిక లేవాదేవీలకు ప్రధానమైన పుస్తక నిర్వహణ, రుణాల రికవరీ డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ రిపోర్టు తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో సిసిలు రామకృష్ణ, మోహనరావు, మోహిని, విష్ణుబాబు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

సోంపేట : మనిషికి వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సోంపేటలో నూతనంగా నిర్మించిన వ్యాయామశాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

నందిగాం : మండలంలోని నందిగామ పంచాయతీకి చెందిన కూర్మాపు కృష్ణారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మృతుడు 1987లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు అప్పటి సహ విద్యార్థులంతా కలిసి రూ.38,500 ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య రమణమ్మకు శనివారం అందించారు. ఈశ్వరరావు, బాబూరావు, మురళి పాల్గొన్నారు.

'లైన్ షోయింగ్'తో చీడపీడల నివారణ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని యర్రవరం పంచాయతీ చిన్నయామలపేటలో తోట ఇంద్రావతి వరి పొలంలో కొసలు తుంచి వరి లైన్ షోయింగ్ పద్ధతిలో శనివారం నాటారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి వెంకటరమణ మాట్లాడుతూ వరి లైన్ షోయింగ్ చేయడం వల్ల చీడపీడల నుంచి రక్షణ కలుగుతుందని అన్నారు. గాలి వెలుతురు తగిలి పిలకల పరిమాణం పెరిగి మంచి దిగుబడి వస్తుందని అన్నారు. వరి లైన్ పద్ధతులు వేస్తే ప్రకృతి యాజమాన్య పద్ధతులు పాటించడానికి అనువుగా ఉంటుందని అన్నారు. దుబ్బులు పెద్దగా వేపుగా పెరిగి రైతులకు అధిక దిగుబడును తీసుకోవడానికి వీలుగా ఉంటుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం కూడా తగ్గుతుందని అన్నారు. లైన్ షోయింగ్ చేయడంలో నీటి యాజమాన్యం పురుగులు యాజమాన్యం సులువుగా చేసుకోవచ్చు చెప్పారు. శత్రు పురుగులు, తెగులు నుంచి ఈ లైన్ షోయింగ్ చేయడంతో బెడద నుంచి తగ్గించుకోవచ్చు కాబట్టి వరి లైన్ షోయింగ్ చేయడం మంచి పద్ధతని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అంజలి, వెంకటలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పంటలో రాజీలేని సూత్రాలు తప్పనిసరి

ఆమదాలవలస : మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సిబ్బంది వరి పంటలో జిగురుపూసిన పసుపు అట్టలను పెట్టించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం మండల యాంకర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని చేపేనపేటలో వరి పంటలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో జిగురు పూసిన పసుపు అట్టలను శనివారం పెట్టించామని తెలిపారు. వీటిని పొలంలో పెట్టడంతో పంటను ఆశించే పచ్చదోమ ఉధృతిని తెలుసుకోవచ్చునని అన్నారు. దీనికి నివారణా చర్యగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మెరుగైన విధానాలను చేపట్టవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరాం పాల్గొన్నారు.

లైన్ షోయింగ్ పద్ధతిలో నాటుతున్న మహిళలు

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి: వచ్చే నెల 9న స్థానిక జూనియర్ సవిల్ కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవా సంఘం అద్యక్షులు డి.శ్రీభరణి అన్నారు. శ్రీకాకుళంలో పోలీస్ అధికారులు, ఎపిపిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 9న జరగనున్న లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను గుర్తించి ప్రీ లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నచిన్న తగాదాలు, వరకట్న నిషేధ కేసులు, అక్సిడెంట్ కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీపడేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్టు ఎపిపి డి.హరిప్రియ, బి.బాలకృష్ణ, ఎన్.వెంకటరావు, కె.అశోక్, పోలీసులు పాల్గొన్నారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజు

జనసేనలో పలువురు చేరిక

కంచిలి : మండలంలోని కొండపోలేరుకు చెందిన సుమారు 70 కుటుంబాలు శనివారం ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులమై ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి దాసరి రాజు పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామానికి చెందిన బోర కురాడు అనే వ్యక్తి పక్షవాతం తో బాధపడుతున్న సమాచారం తెలుసుకొని ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో డొక్కరి ఈశ్వరరావు, ఆర్.భాస్కరరావు, రోజా, బి.పార్వతి, మన్మథ, శంకర్, నిరంజన్, ప్రకాష్, కేశవరావు, వాసు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయునికి సన్మానం

సోంపేట : మండలంలోని ఎ.సి.రామచంద్రాపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన వై.సురేష్ కుమార్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ సురేష్‌కుమార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశరావు, సాయిరాజ్, రాజేంద్రకుమార్, రామస్వామి, రాజు, మాధవరావు, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, శివ పాల్గొన్నారు.

పత్రాలను అందజేస్తున్న నాయకులు

భూ హక్కు పత్రాల పంపిణీ

ఇచ్ఛాపురం : మండలంలోని మశకాపురంలో భూ రీ సర్వే పూర్తి చేసి రైతులకు భూ హక్కు పత్రాలను ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ తహశీల్దార్ కార్యాలయంలో భూ హక్కు పత్రాలలను అందించారు. గ్రామంలో రీ సర్వే పూర్తి చేసి రైతులు అందరికి 458 భూ హక్కు పత్రాలను అందజేశామని డిటి శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి శ్రవణ్‌కుమార్, విఆర్‌ఒలు రాజారెడ్డి, తారకేష్ పాల్గొన్నారు.

అల్పాహారం వితరణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్యసాయి పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో శనివారం అల్పాహారం వితరణ అందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి మాట్లాడుతూ తన పుట్టిన రోజులు వేడుకలు నిష్కలంక జీవనం సాగిస్తున్న మానసిక వికలాంగుల మధ్య నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, సెక్రటరీ శివకుమార్, సింహాచలం, చేయూత మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.